క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా 112 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ కో ఆర్డినేటర్ రాంబాబు, కళాశాల సీఏవో సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీక దీప విశిష్టతపై కార్యక్రమాలు



శ్రీకృష్ణునికి హారతిస్తున్న నిష్కించిన భక్తదాస

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శుక్రవారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కార్తీకదీప విశిష్టతపై కార్యక్రమాలు నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో సంకీర్తన, దామోదర హారతి, దామోదర అష్టకం, నెయ్యి దీపాల హారతి, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ కార్తీకమాస ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం భక్తులు దామోదర అష్టకం పాడుతూ నెయ్యి దీపాలతో హారతిచ్చి ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అంబరీష దాస, నితాయి తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

పద్మనాభం: వెలుగు వీవోఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు మణి డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని మూడు రోజుల నుంచి చేస్తున్న ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీవోఏల మూడేళ్ల ఉద్యోగ కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, వేతనాల బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కంచమ్మ, కార్యదర్శి ఆర్.రామలక్ష్మి పాల్గొన్నారు.

కృతజ్ఞతార్పణల పండగ నేడు

తగరపువలస: చిట్టివలస లండన్ మిషన్ చర్చ్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కృతజ్ఞతార్పణల పండుగ నిర్వహించనున్నారు. 1800లో నిర్మితమై 1861లో బ్రిటీష్ వారిచే ఈ చర్చిలో ఆరాధన ప్రారంభించినట్టు పాస్టర్ ఎం.సుబ్బారావు జాకబ్ తెలిపారు. విజయనగరం జిల్లా సాలూరు ఐపీసీ చర్చ్ పాస్టర్ ఎ.భూషణరావు ముఖ్య ప్రసంగం చేస్తారన్నారు.

సెల్‌టవర్ వద్దంటూ ఆందోళన

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస సుభీభవ కాలనీ వద్ద సెల్‌టవర్ నిర్మాణం వద్దంటూ స్థానికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. 300 కుటుంబాల వారు నివసిస్తున్న ఈ కాలనీలో సెల్‌టవర్ నిర్మాణం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయన్నారు. ఈ మేరకు సంతకాలతో కూడిన వినతిపత్రాలను ముఖ్యమంత్రి, కలెక్టర్, భీమిలి జెడ్సీకి పంపించారు.

గ్రామ సభకు 71 దరఖాస్తులు



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో రీసర్వేలో తప్పుల సవరణ కోసం శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో 71 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. పేర్లు, విస్తీర్ణం సరి చేయాలని కోరారు. తహసీల్దార్ కె.ఆనందరావు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వరలక్ష్మి పాల్గొన్నారు.

రహదారుల్లో అంధకారం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట జాతీయ రహదారి నుంచి జీడిపప్పుల దుకాణాల వరకు హైవేలో కొద్ది రోజులుగా లైట్లు వెలగడం లేదు. విశాఖ వైపు మార్గంలో వెంకటేశ్వర మెట్ట మొదలుకుని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాల, రామన్నపేట, వెలంపేట, తాతా థియేటర్ వెనుక ప్రాంతాలు చీకటిగా ఉంటున్నాయి. రామన్నపేట అండర్‌పాస్ వే కూడా అంధకారంగా ఉండటంతో చీకటి పడిన తరువాత ఈ మార్గంలో ఒంటరిగా రాకపోకలు చేయడానికి ఎవరూ సాహసించడం లేదు. ఇటీవల తగరపువలస శివారు ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిలు ఒంటరిగా, చీకటి మార్గాల్లో ప్రయాణించే వారిపై దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా హైవేను ఆనుకుని నివసిస్తున్న వారు ఇళ్ల బయట అదనంగా లైట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రమాదాలు, దొంగతనాలు జరగక ముందే ఈ ప్రాంతంలో హైవే అధికారులు లైట్లు పునరుద్ధరించాలని రామన్నపేట, బంగ్లామెట్ట, వెంకటేశ్వరమెట్ట, బాలాజీనగర్ వాసులు కోరుతున్నారు.



బంగ్లామెట్ట వైపు హైవేలో వెలగని లైట్లు



చీకటిగా రామన్నపేట సర్వీస్ రోడ్డు



రామన్నపేట అండర్‌పాస్‌వేలో అంధకారం

విద్యార్థుల ప్రతిభకు వేదిక

- ఈ నెల 20 నుంచి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు
- పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహణ

తగరపువలస: రాష్ట్ర స్థాయి ప్రతిభ అన్వేషణలో భాగంగా భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్తంగా ఈ నెల 20 నుంచి కౌశల్-2024 పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో, రాష్ట్ర స్థాయి పోటీలు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 29, 30 తేదీల్లో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో జరుగుతాయి. కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలు, పోస్టర్ కాంపిటీషన్, వైజ్ఞానిక లఘు చిత్ర పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించనున్నారు.

ఇవీ అంశాలు.. వీరు అర్హులు

ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. గణితం, విజ్ఞాన శాస్త్రం, సాంఘిక శాస్త్రం రంగాల్లో భారతీయ శాస్త్రవేత్తల కృషికి సంబంధించి సిలబస్‌పై పోటీలు ఉంటాయి. ప్రతి తరగతి నుంచి ముగ్గురు మెరిట్ విద్యార్థులను ఎంపిక చేస్తారు.

- క్విజ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రోత్సాహక బహుమతుల కింద జట్టుకు రూ.6 వేల చొప్పున అందిస్తారు.



పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్ (ఫైల్)

- పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో జనరల్ అంశంపై 8వ తరగతి నుంచి, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే అంశంపై 9వ తరగతి నుంచి ఇద్దరేసి విద్యార్థులు పాల్గొనవచ్చు.
- వైజ్ఞానిక లఘు చిత్ర పోటీలకు సంబంధించి సులభ సూత్రాలు ఉపయోగించి రూట్ విలువలు కనుగొనుట, ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుల పరిశోధనలకు 10వ తరగతి విద్యార్థులు ఇద్దరు పాల్గొనవచ్చు.

15లోగా పేర్లు నమోదు చేసుకోండి



పాఠశాలల్లో కో ఆర్డినేటర్లు విద్యార్థుల పేర్లను ఈ నెల 15లోగా www.bvmap.org ద్వారా నమోదు చేసుకోవాలి. గణితం, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉత్సాహం నింపాలి. వివరాలకు 89850 49213 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– పక్కి నాగేశ్వరరావు, కౌశల్ జిల్లా కో ఆర్డినేటర్, చిట్టివలస

ఇసుక కోసం 11న మహాధర్నా

తగరపువలస: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ ఉత్తుత్తిదేనని తేలిపోయిందని, దీనిని నిరసిస్తూ ఈ నెల 11న జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగానున్న గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేయనున్నట్లు ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను కార్మికవాడలో భవన నిర్మాణ కార్మికులకు శుక్రవారం పంచుతూ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన ఇసుక పాలసీని ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. అందరికీ ఉచితమని ప్రకటించినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 ఇసుక రీచ్‌లు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ఓపెన్ చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో ఇసుక డెలివరీ చేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలకు విక్రయించడం ప్రభుత్వ అక్రమ వ్యాపారమేనన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఇసుక తవ్వకాల అనుమతుల్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కె.ఈశ్వరరావు, కె.రాంబాబు, ఎం.అప్పలరాజు, సీహెచ్ రాంపైడి, గోవింద తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికులకు మహాధర్నా కరపత్రాలు అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవుడి భూమిని రక్షించండి.. అక్రమార్కులను శిక్షించండి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 84లోని 31 సెంట్ల శ్రీరాముని దేవాలయానికి చెందిన భూమిని అక్రమంగా అమ్మేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ భూమి వద్ద గ్రామస్తులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేవుని భూమికి దొంగపత్రాలు సృష్టించి అమ్మిన వారిని, కొన్నవారితోపాటు మధ్యవర్తులను కూడా శిక్షించాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లో శ్రీరాముని దేవాలయం భూమి అని స్పష్టంగా ఉన్నప్పటికీ సెప్టెంబర్ 26న పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగపత్రాలు సృష్టించి, 750 గజాల చొప్పున రెండు డాక్యుమెంట్లతో జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించేశారన్నారు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వదిలి వేరే చోటకు వెళ్లారంటేనే ఇది దొంగపని ఇట్టే అర్థమవుతుందని చెప్పారు. గ్రామస్తులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేసి 10 రోజులు గడుస్తున్నా.. కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. తాము ఈ విషయాన్ని తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. దేవుడి భూమిని రక్షించాలని, అక్రమార్కులను శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సమితి నాయకుడు వి.సత్యనారాయణ, సీపీఎం నాయకులు సియాద్రి పైడితల్లి, టీడీపీ, వైఎస్సార్ సీపీ కొమ్మాది గ్రామ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



కొమ్మాదిలో అక్రమంగా విక్రయించిన భూమిలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సుస్థిర లక్ష్యాల సాధనలో భాగం కావాలి

తగరపువలస: సుస్థిర లక్ష్యాల సాధనలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని గంభీరం ఐఐఎంవీ అకడమిక్ డీన్ మరిశెట్టి విజయభాస్కర్ అన్నారు. భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైన యూత్ ఫర్ ఏ సస్టెయినబుల్ ఫ్యూచర్ సదస్సులో ఆయన మాట్లాడారు. కలసికట్టుగా పనిచేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. ఈ మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ వేదిక విశాఖ చాప్టర్ విద్యార్థులకు ప్రపంచ సమస్యలపై అవగాహన పెంచే కార్యక్రమంగా దోహదపడుతుందన్నారు. విశాఖ నలుమూలల నుంచి యువ డిబేటర్లు, డిప్లమాట్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఐఐఎంవీ అకడమిక్ డీన్ విజయభాస్కర్

8వ వార్డులో 'ఫ్రైడే - డ్రైడే'పై అవగాహన

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో శుక్రవారం ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ దోమల నిర్మూలనకు వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని స్థానికులకు సూచించారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తడి, పొడి చెత్తను వేరువేరుగా నిల్వ చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామసభ బహిష్కరణ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురంలో శుక్రవారం జరగాల్సిన రీ సర్వే గ్రామ సభను రైతులంతా బహిష్కరించారు. గ్రామసభకు తహసీల్దార్ రాకపోవడంతో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మజ్జివలస రెవెన్యూ పరిధిలో లక్ష్మీపురం పంచాయతీకి సంబంధించి ఎక్కువ భూములు ఉన్నాయని రైతులు తెలిపారు. రీ సర్వేలో రైతులకు సంబంధించిన భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నందున తహసీల్దార్ ఆధ్వర్యంలోనే గ్రామసభ నిర్వహించాలని మూకుమ్మడిగా రైతులు గ్రామసభను బహిష్కరించినట్టు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా నాయకులతో సరిగా మాట్లాడటం లేదని, అందువల్ల తమ సమస్యలు పరిష్కరించేవరకు గ్రామసభ జరగనివ్వబోమన్నారు. గ్రామసభను బహిష్కరించిన వారిలో సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, గాడు తాతినాయుడు, మొకర పైడినాయుడు, కనకల వెంకటరమణ ఉన్నారు.

13 నుంచి బంగారమ్మ ఉత్సవాలు

పద్మనాభం: పాండ్రంగిలో ఈ నెల 13, 14న నిర్వహించనున్న బంగారమ్మ ఉత్సవాలకు అందరూ సహకరించాలని ఉత్సవ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు సాగి ప్రశాంత్ రాజు కోరారు. బంగారమ్మ ఉత్సవాలపై శుక్రవారం ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న తొలేళ్ల ఉత్సవం, 14న రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 10న మరిడిమాంబ ఉత్సవం, 12న దేవర సంబరంతో బంగారమ్మను గ్రామంలోకి తీసుకొస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, అముజూరి అప్పారావు, కొసర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లి బాల ఆలయానికి భూమిపూజ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ దేవత సుత్తమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు, సుత్తమ్మతల్లి భవాని పీఠం సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో కార్యక్రమాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఉన్న ఆలయం సమీపంలో బాల ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. తాత్కాలిక ఆలయాన్ని నిర్మించి అందులో ఈ నెల 14న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. 18న పాత ఆలయాన్ని తొలగించే కార్యక్రమం ప్రారంభించి 2026 మే నాటికి కొత్త ఆలయ నిర్మాణం పూర్తి చేయనున్నారు.

ప్రైవేట్ స్కూళ్లకు జీవీఎంసీ పార్కుల కేటాయింపు

మధురవాడ: ప్రైవేట్ స్కూళ్ల ఆటల అవసరాలకు ప్రభుత్వ పార్కులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో రూ.99 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు శుక్రవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పీఎం పాలెంలో ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం జీవీఎంసీ పార్కులో నిబంధనలకు విరుద్ధంగా పచ్చదనాన్ని నాశనం చేసి క్రీడా కోర్టులు నిర్మిస్తోందని 'సాక్షి' ఆయన దృష్టికి తీసుకువెళ్లింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆట స్థలాలు లేని కొన్ని ప్రైవేటు స్కూళ్ల క్రీడా అవసరాల కోసం ఒక పార్కు చొప్పున కేటాయించేలా చర్యలు చేపడతామన్నారు. 5, 6, 7, 8 వార్డుల్లో 255, వాటర్ వర్క్స్ పనులతో కలిపి రూ.99 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాలు తీసేస్తే 60 శాతం నియోజకవర్గం జీవీఎంసీ పరిధిలోనే ఉందని, భీమిలిలో రహదారుల విస్తరణ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భీమిలి-తగరపువలస రోడ్డు విస్తరణ, తగరపువలస ట్రాఫిక్ సమస్య పరిష్కారం చేయాల్సి ఉందన్నారు. కొమ్మాది శ్రీరాముడు భూములు కూడా పరిశీలించి రక్షణ చర్యలు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు. కాని అక్కడికి వెళ్లకుండానే నగరంపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, చంద్రంపాలెంలో కమ్యూనిటీ హాల్‌కు స్థల పరిశీలన చేసి ఆయన జారుకున్నారు. కార్యక్రమాల్లో జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, పిళ్లా నర్సింగరావు, దాసరి శ్రీనివాస్, బోయి రమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన గంగిరెడ్ల వర్ధన్ (20) ఈ నెల 6న ద్విచక్ర వాహనంపై ఆనందపురం మండలం బోని గ్రామంలో ఉన్న అమ్మమ్మ గారి ఇంటికి వస్తున్నాడు. మార్గ మధ్యలో ఏనుగులపాలెం సమీపంలోని కరెంటు ఆఫీసు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రోడ్డు మీద పడిపోయాడు. దీంతో వర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి వీరుబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తిమ్మాపురంలో భూ ఆక్రమణలపై మరింత నిఘా

కొమ్మాది: తిమ్మాపురం పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని, ఆక్రమణదారులపై నిఘా పెంచి ఆక్రమణలు జరగకుండా చూడాలని ఏసీపీ రామకృష్ణను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబుతో కలిసి తిమ్మాపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా జరుగుతున్న భూ ఆక్రమణలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ దీపాలు సరిగ్గా లేనందున ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వార్డులోని పలు నివాసాలకు ఆస్తిపన్ను విధించాలని కార్పొరేటర్ కొండబాబు కమిషనర్ దృష్టికి తీసుకురాగా... పరిశీలిస్తామని తెలిపారు. తిమ్మాపురంలో శిథిలావస్థలో తుఫాన్ రక్షిత భవనాలు 4 ఉన్నాయని, వాటిని పరిశీలించి తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సహాయక ఇంజినీరు సురేష్, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

ప్రజా చైతన్య యాత్రలు ప్రారంభం

తగరపువలస: ప్రజా సమస్యలపై సీపీఎం ఈ నెల 15 వరకు చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్రలు శుక్రవారం ఒకటో వార్డు కొత్తపేటలో ప్రారంభమయ్యాయి. ముందుగా యాత్రల పోస్టర్‌ను పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్ మూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. అధిక విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, నిత్యావసర సరకుల ధరలు పెరుగుదల వంటి సమస్యలపై పాదయాత్రల ద్వారా ప్రజలను చైతన్యవంతులుగా చేస్తామన్నారు. అందుబాటులో లేని ఇసుక కారణంగా భవన నిర్మాణ కార్మికులు నాలుగు మాసాలుగా కుటుంబాలతో పస్తులు ఉంటున్నారన్నారు. రాష్ట్రంలో పసిపాపల నుంచి వృద్ధ మహిళల వరకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నా.. కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకుండా పోయిందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి ఆధారిత పన్ను విధానం, ప్రతి ఏటా పెంచే 15 శాతం పన్నును ఉపసంహరించుకోవాలన్నారు. సూపర్ సిక్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. పాదయాత్రలో జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు,ఊళ్ల నాగరాజు, రీసు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రజా చైతన్య యాత్రల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాపోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ : ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలకు ఏమీ పట్టడం లేదని సీపీఎం మధురవాడ ప్రాంత నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి 15 వరకు ప్రజాపోరు పేరుతో చేపట్టే యాత్రకు సంబంధించిన పోస్టర్ కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను కదిలించి ఆందోళనలు చేపడతామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారం మోపిందన్నారు. తాజాగా మరో రూ.11 వేల కోట్ల భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ఇది అన్యాయమని, ప్రజలు సహించే పరిస్థితిలో లేరని చెప్పారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా చేపట్టే ప్రజాపోరు కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.రాజ్‌కుమార్, బి.భారతి, డి.కొండమ్మ, టీకే శారదలు పాల్గొన్నారు.



మధురవాడలో ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

భీమునిపట్నం: విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని భీమునిపట్నం 1వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సౌజన్య ఆకాంక్షించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన ర్యాగింగ్ వల్ల తలెత్తే దుష్పరిణామాలు, ఇతర చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు సంబంధించిన చట్టాలు, వారి హక్కులు, బాధ్యతల గురించి ఆమెతోపాటు ఇతర వక్తలు వివరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పార్వతీశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సురేష్‌రెడ్డి, అప్పలరాజు, న్యాయవాది కనక మహాలక్ష్మి, జూనియర్ న్యాయవాది లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ జడ్జి సౌజన్య

పెద్ద నోట్ల రద్దుకు ఎనిమిదేళ్లు

తగరపువలస: భారత ప్రభుత్వం రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేసి వాటికి బదులుగా కొత్త రూ.500, రూ.2 వేల నోట్లు ప్రవేశపెట్టి ఎనిమిదేళ్లు పూర్తయిందని ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ 2021 నవంబర్‌లో ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా, డీమోనిటైజేషన్ నగదు వినియోగదారులుగా మార్చవలసిన అవసరం లేనందున దేశంలో డిజిటల్ చెల్లింపులలో పెరుగుదల కనిపించిందన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, సంజీవి పాల్గొన్నారు.